గ్రామాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

జిన్నారం(పటాన్‌చెరు): పటాన్‌చెరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం గుమ్మడిదలలో హానర్స్ ల్యాబ్స్ వారి సౌజన్యంతో రూ. 20 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు షేక్‌హుస్సేన్, బీఆర్‌ఎస్ నాయకుడు విజయభాస్కర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ సమాచారంతో సాగాలి

రాయదుర్గం: సైబరాబాద్ పరిధిలో వాహనదారులు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్, వాట్సప్‌లను ఫాలో అయి ఎప్పటికప్పుడు అప్‌డేట్స్‌ను గమనించి ఆయా రూట్లలో రాకపోకలు సాగించాలని కోరారు. గురువారం మాదాపూర్‌లోని లెమన్‌ట్రీ నుంచి టెక్ మహీంద్ర/సీఐఐ మార్గంలో లారీ బ్రేక్‌డౌన్ కావడంతో రాకపోకలు నెమ్మదిగా సాగాయని, అదేవిధంగా బాలానగర్ నుంచి కూకట్‌పల్లి వై జంక్షన్ మార్గంలో బస్సు బ్రేక్ డౌన్ అవడంతో కూడా రాకపోకలు మందగించాయని అధికారులు పేర్కొన్నారు. ట్రాఫిక్ అప్‌డేట్స్‌తో ముందుకు సాగాలని వారు సూచించారు.

విద్యార్థులకు బుక్స్ పంపిణీ

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రమైన జిన్నారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం ఎంపీటీసీ లావణ్య, స్థానిక నాయకులతో కలసి పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగ్గా, ప్రభుత్వ బడులు అన్ని మౌలిక సదుపాయాలతో సిద్ధమయ్యాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్, గ్రామ అధ్యక్షుడు శంరయ్య, నాయకులు కోటేష్‌గౌడ్, భాస్కర్, ప్రదీప్‌గౌడ్, ప్రవీణ్, వెంకటేశ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మణికొండ: ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా జీఓ 111 పరిధిలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశాలతో అధికారులు గురువారం కూల్చివేశారు. వట్టినాగులపల్లి రెవెన్యూ పరిధిలోని శంకరహిల్స్ లేఅవుట్‌లో ఓ షెడ్, తులసి లేఅవుట్‌లో వెలసిన రెండు భవనాల స్లాబులను హెచ్‌ఎండీఏ, డీటీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం కూల్చివేసింది. మున్సిపాలిటీ పరిధిలో తీసుకున్న అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు టీపీఓ మణిహారిక, ఆర్ఐ విక్రంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రిమినల్ చట్టాలపై పోలీసులకు శిక్షణ

మూసాపేట: కూకట్‌పల్లి రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో గురువారం పోలీసుల 4వ బ్యాచ్ ట్రెనింగ్ ముగిసింది. క్రిమినల్ నూతన చట్టాలపై ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్‌లోని ట్రాఫిక్, ఎస్‌ఓటీ విభాగాల ఆఫీసర్లు పాల్గొన్నారు.బాలానగర్ అడిషనల్ డీసీపీ సత్యనారాయణ ఆఫీసర్లకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్, సిఐ కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్ 15 ఫేజులో రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తోందని స్థానికులు మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు దృష్టికి తీసుకురాగా గురువారం ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ఈ సమస్య అధికం అవుతుందని, మురుగునీరు రోడ్డుపై కాకుండా కాలువలోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రైనేజీ లైన్ వేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ శ్రవణ్, నాయకులు ఆనంద్, సుశీల్, లీడర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నాలా రిటర్నింగ్‌వాల్ పనుల పరిశీలన

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ జింకలవాడలో రూ.90 లక్షలతో నిర్మిస్తున్న నాలా రిటర్నింగ్‌వాల్ పనులను స్థానికులతో కలిసి కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ గురువారం పరిశీలించారు. నాలా రిటర్నింగ్‌వాల్ వద్ద ఇళ్లు డ్యామేజ్ అయ్యాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన మాట్లాడుతూ ప్రజల ఇబ్బందుల దృష్ట్యా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజు, సుదర్శన్‌రెడ్డి, బాల నరసింహులు, రాములు, అంజి, రాజు, వెంకటేష్, ఫిరోజ్, సాయి, సాయి కుమార్, లక్ష్మణ్, వెంకటేష్, ఫరూఖ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 60, పచ్చిమిర్చి 80, బెండ 60, కాకర 60, దొండ 40, దోస 50, ఆలు 40, చామ 60, కీర 40, బీర 90, వంకాయ 40, గోకర 60, బీన్స్ 140, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 40, క్యారెట్ 70, చిక్కుడు 120, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (3)20 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 180, వెల్లుల్లి 280.

రైలు పట్టాలు దాటుతున్న ప్రయాణికులు, స్థానికులు



రైల్వే స్టేషన్ ముందు పార్కింగ్ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు



ఎంఎంటీఎస్.. సమస్యలెన్నో..

అపరిశుభ్రంగా మంచినీటి కుళాయిలు, మరుగుదొడ్లు

- పట్టాలు దాటుతూ.. ప్రమాదాల బారిన..
- ఎఫ్ఓబీ ఎక్కలేక దగ్గర దారంటూ..
- చందానగర్ రైల్వే స్టేషన్‌లో లిఫ్టులు ఏర్పాటు చేయాలని ప్రయాణికుల వినతి

హఫీజ్‌పేట్ : చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌లో సమస్యలు నెలకొన్నాయి. మంచినీటి కుళాయిలు, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. రైల్వేస్టేషన్ వద్ద సమీప కాలనీ లవాసులు పట్టాలు దాటుతూ ప్రమాదాల బారినపడుతున్నారు. పాపిరెడ్డి కాలనీ, చందానగర్ వైపు వెళ్లడానికి ఫుట్‌ఓవర్ బ్రిడ్జి అందుబాటులో ఉన్నా దగ్గర దారి అంటూ రైల్వే ట్రాక్ దాటుతున్నారు. వృద్ధులు, మహిళలు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మెట్లు ఎక్కలేక ఇబ్బందిపడుతున్నారు. ఇక లగేజీ ఉంటే అవస్థ చెప్పనలవి కాదు. పార్కింగ్ స్థలంలో షెడ్డులు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. స్టేషన్ ముందు చెత్త వేయడం.. ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్‌తో స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. స్టేషన్ ముందు ఉన్న బస్‌షెల్టర్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది.

- చందానగర్ రైల్వేస్టేషన్‌లో ఇరువైపులా ఫ్లాట్‌ఫారాలకు వెళ్లాలంటే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఉంది. అవతలి ఫ్లాట్‌ఫారానికి వెళ్లడానికి మెట్లు ఎక్కలేక వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారు.
- రైల్వేస్టేషన్ ముందు రోడ్డు కంకర తేలి ద్విచక్ర వాహనదారులు భయపడుతున్నారు.
- వాహనాల పార్కింగ్ స్థలంలో షెడ్డు లేకపోవడంతో ఎండలోనే వాహనాలు నిలుపుతున్నారు.
- ప్రధాన ద్వారం ముందు ఇష్టానుసారంగా వాహనాలను పార్కు చేస్తున్నారు
- బస్‌షెల్టర్ ముందు చిరు వ్యాపారాల నిర్వహణతో సమస్యలు నెలకొన్నాయి.
- రైల్వే స్టేషన్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది
- వాహనాల పార్కింగ్ ఏరియాలో పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారింది.
- రైల్వే పట్టాలు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్న స్థానికులు
- కాగా రైల్వే ట్రాక్ దాటకుండా కంచె వేయాలి. రైల్వే స్టేషన్‌లో వృద్ధులు, వికలాంగుల కొరకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి లిఫ్టులు ఏర్పాటు చేయాలి. రైల్వే స్టేషన్ పార్కింగ్ స్థలంలో షెడ్డును నిర్మించాలి. బస్ షెల్టర్ ముందు చిరువ్యాపారుల దుకాణాలను తొలగించి బస్సులు, ఆటోలు నిలబడే విధంగా అధికారులు ఏర్పాటు చేయాలి. వాహనాల పార్కింగ్ స్థలంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



స్టేషన్ వద్ద కంకర తేలిన రోడ్డు



రైల్వే స్టేషన్ ముందు వాహనాల పార్కింగ్‌కు షెడ్డు లేని దృశ్యం

పార్కింగ్ స్థలంలో షెడ్డు వేయాలి



చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌లో రోజు వేలాదిమంది ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. వాహనాలు పార్క్ చేసి నగరానికి వెళ్తుంటారు. కానీ ఎండకు, వానకు తడిసి ద్విచక్ర వాహనాలు పాడైపోతున్నాయి. అధికారులు షెడ్డు ఏర్పాటు చేయాలి.

– వెంకటేశ్వర్లు, చందానగర్

లిఫ్టులు ఏర్పాటు చేయాలి



చందానగర్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారం దాటాలంటే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఉంది. కానీ పాపిరెడ్డి కాలనీ, చందానగర్ వాసులు పట్టాలు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్లాట్‌ఫారాలు మారాలంటే వృద్ధులు, వికలాంగులు ఇబ్బందిపడుతున్నారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి లిఫ్టులు ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులకు వినతిపత్రం అందించాను. ఇప్పటికైనా అధికారులు సౌకర్యాలు కల్పించాలి.

–జయప్రకాష్, చందానగర్

15,16 తేదీలలో నేచర్ క్యాంప్

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రెండురోజుల నేచర్ క్యాంప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ చేరువలోని చిలుకూరు ఫారెస్ట్‌ట్రెక్ పార్కులో ఈ క్యాంపు ఉంటుందని టీఎస్‌ఎఫ్‌డీసీ అధికారులు తెలిపారు. ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు పాల్గొనే వారు రిపోర్టు చేయాలని, ఈ కార్యక్రమాన్ని 16వ తేదీ ఉదయం 10 గంటల వరకు నిర్వహిస్తారు. కార్యక్రమంలో పాల్గొనేవారిలో 12 ఏళ్ళు పైబడిన వారు రూ.1800 చెల్లించాలని, 5 నుంచి 12 ఏళ్ళలోపు ఉన్నవారు రూ.1200 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్9493549399, 9346364583లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

చెరువుల పరిరక్షణకు కృషి చేయాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్



సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ శశాంక్, జెడ్సీ స్నేహ

రాయదుర్గం: చెరువుల పరిరక్షణకు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ అధికారులను ఆదేశించారు. గురువారం జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ జోనల్ కార్యాలయంలో చెరువు పరిరక్షణపై జీహెచ్‌ఎంసీ, నీటిపారుదల శాఖ అధికారుల సమన్వయ సమావేశాన్ని జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి జోన్ పరిధిలో చెరువు స్థలాల పరిరక్షణకు అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువుల పర్యవేక్షణకు నియమించిన అధికారులు విధిగా తమ పరిధిలోని చెరువులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. చెరువుల ఎఫ్‌టిఎల్ బఫర్‌జోన్లపై అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. చెరువుల చుట్టూ రక్షణ కంచెను విధిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్లలో ఎలాంటి ఆక్రమణలను ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. చెరువుల పరిరక్షణ కమిటీలతో ఎప్పటికప్పుడు జోనల్ అధికారులు సమీక్ష నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకుంటూ ఉండాలన్నారు. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ నీటిపారుదల శాఖ అధికారులు, చెరువుల పరిరక్షణ కమిటీ అధికారులు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్.. 8 బస్సులు సీజ్

పటాన్‌చెరు టౌన్: విద్యా సంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ పేరిట స్కూలు బస్సులను రవాణశాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు.రెండో రోజు గురువారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో బస్సుల తనిఖీ నిర్వహించారు. వివిధ విద్యా సంస్థలకు చెందిన ఫిట్‌నెస్ లేని 8 బస్సులను సీజ్ చేశారు.ఈ సందర్భంగా ఎంవీఐ విజయరావు మాట్లాడుతూ... ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.



ఎమ్మెల్యే చొరవతో కాలనీకి బస్సు సౌకర్యం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీకి ఆర్‌టీసీ బస్సు సౌకర్యం కల్పించినందుకు గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని ఆయన నివాసంలో కలిసిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ 41 సి ఆర్‌టిసి బస్సు ఆస్‌బెస్టాస్ కాలనీ నుంచి అఫ్జల్‌గంజ్ వరకు నడుస్తుందన్నారు. కాలనీ, పరిసర ప్రాంత ప్రజలు బస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆస్‌బెస్టాస్ కాలనీ ప్రెసిడెంట్ నరేష్, వైస్ ప్రెసిడెంట్ నర్సింహులు, జనరల్ సెక్రటరి మహమ్మద్ హుస్సేన్, జాయింట్ సెక్రటరి ఎంఏ రఫీక్, ట్రెజరర్ పుష్ప, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన అసోసియేషన్ నాయకులు

పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్యం పనులను గురువారం ఉదయం తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని నిత్యం ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించి అమలు తీరును పరిశీలిస్తున్నట్లు వివరించారు. కొన్ని ప్రాంతాలలో రోడ్ల పక్కన చెత్త పారబోస్తున్నారని అది తగదన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఇళ్ల వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలకే చెత్తను ఇవ్వాలని కోరారు. ప్రజలు వారి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

బస్సుల సంఖ్య పెంచాలి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామానికి సరైన బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బస్సుల సంఖ్యను పెంచాలని కాంగ్రెస్ నాయకులు హెచ్‌సీయూ డిపో మేనేజర్‌ను కోరారు. గురువారం డీఎం మురళీరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు కె.శేఖర్, ఎస్.మల్లేష్ ముదిరాజ్‌లు మాట్లాడుతూ రాష్ట్ర రాజధానికి, ఐటీ జోన్‌కు సమీపంలో ఉన్న తమ గ్రామానికి సరైన బస్ సౌకర్యం లేకపోవటం దారుణమన్నారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులుఅరుణ్‌కుమార్, ఎం.సాయిరాం, కె.సాయియాదవ్, బి.సాయి తివారి తదితరులు పాల్గొన్నారు.

లోతైన మ్యాన్‌హోల్ ఉంది.. రెడ్ మార్క్ అలర్ట్

- మ్యాన్‌హోల్ మూతలకు ఎరుపు రంగు
- వర్షాకాలం నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు

బంజారాహిల్స్: వర్షాకాలం నేపథ్యంలో మ్యాన్‌హోళ్ల వద్ద జాగ్రత్తగా వెళ్లాలంటూ మూతలపై రెడ్‌మార్క్ వేయడమే కాకుండా.. అక్కడ ప్రమాదం పొంచి ఉంది అనే జాగ్రత్తలతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు అధికారులు. భారీ వర్షాలు కురిసినపుడు డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూతలు తెరవకుండా ఇక్కడ లోతైన మ్యాన్‌హోల్ ఉంది.. అంటూ హెచ్చరికలు జారీ చేస్తూ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జలమండలి వర్షాకాలానికి మూడు వారాల ముందే ఎక్కడెక్కడ లోతైన మ్యాన్‌హోళ్లు ఉన్నాయో గుర్తించారు.

- జలమండలి డివిజన్-6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఒకటిన్నర మీటర్ల లోతు పైగా ఉన్న 1200 మ్యాన్‌హోళ్లను అత్యంత లోతైనవిగా గుర్తించారు.
- మ్యాన్‌హోల్‌పై పొరపాటున ఎవరైనా కాలు వేసినా జారిపోకుండా బ్లూకలర్ సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. అలాగే ఈ మ్యాన్‌హోల్ లోతైనవి అని తెలియజేసేందుకు మూతలపై ఎరుపు రంగుతో మార్క్ వేసి అలర్ట్ చేస్తున్నారు.
- ఇప్పటికే 800లకు పైగా మ్యాన్‌హోళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎరుపు రంగు కలర్ కూడా వేయడం పూర్తిచేశారు.
- డివిజన్-6 పరిధిలో మొత్తం 33 వేల మ్యాన్‌హోళ్లు ఉండగా ఇందులో 1200 మాత్రమే లోతైనవని, అందుకే వీటి వద్ద జాగ్రత్తలు సూచిస్తున్నట్లు జలమండలి జీఎం హరిశంకర్ తెలిపారు.



డ్రైనేజీ మ్యాన్‌హోల్‌కు ఎర్ర రంగు వేస్తున్న జలమండలి సిబ్బంది

జీహెచ్‌ఎంసీ మేల్కొనదా..?

- జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ పరిధిలో వరదనీరు వెళ్లే మ్యాన్‌హోళ్లు వేలల్లో ఉన్నాయి. సంబంధిత అధికారులు మాత్రం సదరు మ్యాన్‌హోళ్ల వద్ద ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు.
- గతంలో వరదనీటితో పాటు నాలాల్లో కొట్టుకుపోయి పౌరులు మృతి చెందిన ఘటనలు వెలుగుచూసినా జీహెచ్‌ఎంసీ ఇంజనీర్లలో మాత్రం స్పందన లేకుండాపోయింది.
- జీహెచ్‌ఎంసీకి సంబంధించిన వరదనీటి మ్యాన్‌హోళ్లు లోతైనవి వేలల్లో ఉండగా అవి ఎక్కడెక్కడ ఉన్నాయో సంబంధిత ఇంజినీర్లకే తెలియని పరిస్థితి నెలకొంది.
- వర్షాకాలం కార్యాచరణ ప్రణాళిక రూపొందించడంలో, అమలు చేయడంలో జలమండలి ముందుండగా, జీహెచ్‌ఎంసీకి మాత్రం తీరు బడి లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



మ్యాన్‌హోల్ మూత కింద ఏర్పాటు చేసిన సేఫ్టీ గ్రిల్



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఇనార్బిట్ మాల్‌లో ఫాదర్స్ డే..

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్‌లో ఈ ఏడాది కూడా ఫాదర్స్ డే వేడుకల్ని నిర్వహించనున్నట్టు మాల్ ప్రతినిధులు తెలిపారు. జూన్ 16వ తేదీన జరిగే ఫాదర్స్‌డే కోసం మాల్‌లో ప్రత్యేకమైన థీమ్ అలంకరణలు, ఫొటోబూత్‌లు సిద్ధం చేశామని, తండ్రుల కోసం ప్రత్యేకంగా ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. తండ్రులకు అద్భుతమైన బహుమతులతో పాటు మరచిపోలేని అందమైన జ్ఞాపకాలను అందించేలా అన్నీ సిద్ధం చేశామన్నారు. షాప్ అండ్ విన్ థ్రిల్ పేరిట ప్రత్యేక బ్రాండ్స్ దుస్తుల ప్రదర్శన కూడా ఉందన్నారు.

సీఎంకు వినతి

రాయదుర్గం: కార్పొరేషన్ చైర్మన్‌గా తనకు అవకాశం ఇవ్వాలని కోరుతూ గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టీపీసీసీ వీవర్స్ సెల్ ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాస్ కలిసి వినతిపత్రం అందించారు. అలాగే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీకి వినతిపత్రాన్ని అందించారు.

ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రాయదుర్గం: ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తెలిపారు. గురువారం గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గంకు చెందిన కోడారి కాంతారావుకు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన లక్ష ఇరవై వేలు మంజూరు పత్రాన్ని బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తంలా ఆదుకుంటున్నదన్నారు.

అనుమతి లేని పాఠశాలలను గుర్తించాలి

పటాన్‌చెరు: పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాల పరిధిలో అనుమతి లేకుండా నడుస్తున్న పాఠశాలలను గుర్తించాలని ఎంఈఓ పీపీ రాథోడ్ సిబ్బందికి సూచించారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్, సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సిబ్బందికి బడిబాట కార్యక్రమంలో భాగంగా తరగతుల వారీగా నమోదైన విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలో యూనిఫామ్, షూ, బెల్ట్ అమ్మకాలపై వచ్చే ఫిర్యాదుల గురించి మాట్లాడారు.

సమాచారం

హఫీజ్‌పేట్ : మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఫోన్ నంబర్లు ...

సీఐ ప్రశాంత్ :	9491039172
ఆర్ఐ అనిల్ :	9490617353
ఎస్ఐ మల్లేష్ :	9618581332
ఎస్ఐ నవీన్ :	8712568404
ఎస్ఐ సుభాష్ :	8712663542

చందానగర్ పోలీస్‌స్టేషన్ నంబర్లు :.

ఎస్‌హెచ్ఓ డి.పాలవెల్లి :	9491039172
ఎస్ఐ నాగేశ్వర్‌రావు :	9010851257
ఎస్ఐ శ్రీధర్ :	8712663181
ఎస్ఐ సరితారెడ్డి :	7993183570
ఎస్ఐ రఘు :	8712663184
ఎస్ఐ రమేష్ :	9866859530
ఎస్ఐ కిష్టయ్య :	8712663275

చినుకు పడితే చిత్తడే..



హఫీజ్‌పేట్ : చిన్నపాటి వర్షం పడితే చాలు చందానగర్ సర్కిల్ 21 కార్యాలయం పార్కింగ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్యాణ మండపం ఆవరణ పూర్తిగా చిత్తడవుతుంది. అక్కడ శానిటేషన్ విభాగానికి సంబంధించిన భారీ వాహనాలు, జేసీబీలు, కార్యాలయంకు వచ్చే విజిటర్స్ వాహనాలను ఆ స్థలంలోనే పార్క్ చేస్తున్నారు. పార్కింగ్ ఏరియాకు రావాలంటే వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో పార్కింగ్ ఏరియాలో, కల్యాణ మండపం ఆవరణలో మట్టి పోసి చదును చేయాలని ప్రజలు కోరుతున్నారు.

